


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

శుక్రవారం 3 జూలై 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 2




# పామాయిల్ తోటలతో సిరుల పంట





**-వరిని వీడి పామాయిల్ వైపు మళ్లాలి**

**-రైతులకు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపు, 35 ఏళ్ల పాటు స్థిర ఆదాయం**

భానుపురి /సూర్యాపేట రూరల్

రైతులు వరి సాగుకు స్వస్తి పలికి, రాబోయే రోజుల్లో లాభసాటిగా ఉండే పామాయిల్ తోటల వైపు మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. సూర్యాపేట మండలంలో కాసరాబాద్ లోని ఆయిల్ పామ్ పంటలను కలెక్టర్ పరిశీలించి పామాయిల్ సాగు చేస్తున్న మల్లేష్ అనే రైతుతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పామాయిల్ తోటలు రైతులకు సిరుల పంటగా మారనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.రైతులకు మేలు చేసే పంటల్లో పామాయిల్ అత్యుత్తమమైనదని కలెక్టర్ పేర్కొన్నారు. వరి సాగుతో పోలిస్తే ఇందులో పెట్టుబడి భారం చాలా తక్కువని తెలిపారు.

ఒక్కసారి ఈ తోటను నాటితే నాలుగు సంవత్సరాల నుంచి మొదలై ఏకంగా 30 సంవత్సరాల వరకు రైతులకు స్థిరమైన, అధిక ఆదాయం లభిస్తుందని ఆయన వివరించారు. పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రైతులకు 70 శాతం నుండి 90 శాతం వరకు భారీ సబ్సిడీని అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న ఈ అద్భుతమైన సదుపాయాలను, రాయితీలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తోట నాటిన మొదటి నాలుగు సంవత్సరాల వరకు పెట్టుబడి సహాయం కింద ఎకరానికి రూ.4,200 చొప్పున ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. పామాయిల్ తోటల్లో మొదటి మూడు సంవత్సరాల వరకు మొక్కలు పెరిగే లోపు రైతులు వివిధ అంతర పంటలను సాగు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.

ఇందులో కోకో, వక్క మిరియాలు,తమలపాకు వంటి వివిధ రకాల అంతర పంటలను బహుళ పంటలను సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు. మూడున్నర ఏళ్ల తర్వాత పామాయిల్ ద్వారా ప్రధాన ఆదాయం రావడం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య ,జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి తీగల నాగయ్య, వ్యవసాయ అధికారి కృష్ణ సందీప్ , వ్యవసాయ విస్తరణ అధికారి ముత్తయ్య,సూర్యాపేట డివిజన్ ఉద్యాన అధికారి కట్ట. స్వాతి,ఉద్యాన విస్తరణ అధికారులు యారాల సుధాకర్ రెడ్డి, రంగు ముత్యం రాజు, వంగూరి అనిల్,ఆయిల్ ఫెడ్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ నిమ్మ గోపికృష్ణ , ఫీల్డ్ ఆఫీసర్ భవిష్య ,రైతులు వెదిరే లక్ష్మీ నరసింహారెడ్డి,కిషన్ రెడ్డి, ఆశబోయిన మల్లేష్ ,బొమ్మగాని సైదులు ,రామకృష్ణ ,తన్నీరు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




## సీజ్ చేయబడిన వాహనాలకు ఆరు నెలల గడువు

భానుపురి/సూర్యాపేట ఎస్పీ కార్యాలయం

వివిధ నేరాల్లో, వాహనాల తనికిల్లో పోలీసుల స్వాధీనంచేసుకున్న ద్విచక్ర వాహనాలను సభందిత యజమానులు త్వరితగతిన సరైన పత్రాలు చూపి తీసుకెళ్లాలని జిల్లా ఎస్పీ నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ నేరాలు, వాహనాల తనిఖీల్లో పోలీసులు స్వాధీనం చేసుకోబడి పోలీసుల ఆధీనంలో జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్ మోటార్ వాహనాల విభాగంలో ఉన్న 20 ద్విచక్ర వాహనాలను పోలీస్ లకు సైరైన పత్రాలు చూపి యాజమానులు విడిపించుకోవాలని ఎస్పి సూచించారు. ఆరునెలల గడువులోగా జిల్లా పోలీస్ మోటార్ ట్రాన్స్పోర్ట్ కార్యాలయం నందు సరైన పత్రాలు సమర్పించి విడిపించుకోవాలి. లేకపోతే కాలం చెల్లిన వాహనాలను పాతసామానుకు, సామర్థ్యం ఉన్న వాటిని వేలం కు పంపడం జరుగుతుంది అన్నారు. వీటి వివరాలను జిల్లా పోలీస్ ఫేస్బుక్, ఎక్స్ నందు పొందుప రుస్తాము అన్నారు.

## విబిజి రామ్ జి పథకాన్ని రద్దు చేయాలి

భానుపురి /సూర్యాపేట టౌన్




వినిజి రామ్ జీ పథకాన్ని రద్దు చేయాలని కోరుతూ గురువారం కేంద్రప్రభుత్వ దిష్టి బొమ్మని దగ్దం చేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.డేవిడ్ కుమార్,జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కునుకుంట్ల సైదులు బొడ్డు శంకర్ పాల్గొని మాట్లాడుతూ..పోరాటాలకు తల ఒగ్గి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని 2005లో అమల్లోకి తెచ్చినది దీనిద్వారా వలసలు తగ్గాయి గ్రామ యువతకు ఉపాధి దొరికింది పని కల్పించకుంటే కోర్టు ద్వారా నష్టపరిహారం అందించే అవకాశం ఉండేది. గ్రామీణ ఉపాధి కూలీలకు పని దొరికేది. ప్రతి సంవత్సరం ఈ చట్టానికి నిధులు తగ్గిస్తూ ప్రస్తుతం చట్టాన్ని ఎత్తివేసే పరిస్థితి కేంద్ర ప్రభుత్వం తెచ్చింది. ఉపాధి హామీ చట్టాన్ని విబిజి రాంజీ వికసిత్ భారత్ గ్యారంటీ పర్ రోజ్ గార్ అజీవీక మిషన్ గ్రామీణ పేరుతో పథకం తీసుకొచ్చి 60 శాతం కేంద్ర నిధులు 40శాతం రాష్ట్ర నిధులు కొనసాగించాలని నిన్నటి నుండే అమలుకు పూనుకున్నది గతంలో 90 శాతం కేంద్రం 10 శాతం రాష్ట్రం ఇచ్చేది. 10 శాతం ఇవ్వలేకనే రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బంది పడేది ఇప్పుడు 40% ఇచ్చే పరిస్థితి లేదు ఈ ఫలితంగా ఈ పథకాన్ని రద్దు చేసే ప్రమాదం ఉన్నది కాబట్టి వి బి జి రాంజీ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా రైతులను కూలీలను ఐక్యం చేసి ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు పి.మహేష్. పి వై ఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి. పిడి.ఎస్.యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పుల్లూరి సింహాద్రి,భరత్. ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భయ్యా లింగయ్య, పివైఎల్ డివిజన్ అధ్యక్షులు దండి ప్రవీణ్. పివైఎల్ నాయకులు అశోక్ రెడ్డి. పాల్వాయి బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

## భ్రూణ హత్యల నిర్మూలనకు వైద్యులు ముందుండాలి

భానుపురి /సూర్యాపేట టౌన్

జిల్లాలో వైద్య సేవల మెరుగుదలకు ప్రభుత్వంతో పాటు ప్రైవేటు వైద్యుల సహకారం ఎంతో అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) పేర్కొన్నారు. బుధవారం రాత్రి పట్టణంలో జాతీయ రహదారిలో గల ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) ఫంక్షన్ హాలులో, ఆ సంస్థ (ఐఎంఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో ఆడ శిశువు రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. భ్రూణ లింగ నిర్ధారణ, ఆడ శిశు భ్రూణ హత్యలు వంటి చట్టవిరుద్ధమైన చర్యలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి వైద్యుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. గర్భిణీ స్త్రీలను స్కానింగ్ చేసిన అనంతరం ఆడ, మగ శిశువు వివరాలు వెల్లడించరాదన్నారు. చట్టాలను ఉల్లంఘించే చర్యలకు దూరంగా ఉండాలని, వైద్య వృత్తి గౌరవాన్ని కాపాడాలని కోరారు. ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగిని మానవీయ దృక్పథంతో ఆదరిస్తూ, నాణ్యమైన, పారదర్శక వైద్య సేవలు అందించాలని సూచించారు. రోగులకు అవసరమైన చికిత్స, సరైన సలహాలు, ఆరోగ్య అవగాహన కల్పించడం వైద్యుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో చికిత్స అందించడం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రజారోగ్య కార్యక్రమాల్లో ప్రైవేటు వైద్యులు భాగస్వాములు కావాలని కోరారు. ప్రజారోగ్య అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజానికి సేవ చేయాలని సూచించారు. అలాగే ఆసుపత్రుల్లో పరిశుభ్రత, రోగుల భద్రత, జీవ వైద్య వ్యర్థాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, అత్యవసర వైద్య పరికరాల అందుబాటు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ప్రతి ఆసుపత్రి ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను పాటిస్తూ ప్రజలకు విశ్వసనీయ వైద్య సేవలు అందించాలని కోరారు. వైద్య వృత్తి సేవా ధర్మంతో కూడుకున్నదని, రోగుల్లో నమ్మకాన్ని పెంపొందించే విధంగా వైద్యులు వ్యవహరించాలని సూచించారు. ప్రైవేటు వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిపాలనా ఇబ్బందులు, ప్రజారోగ్య కార్యక్రమాల అమలులో ఉన్న అవరోధాలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సమస్యల పరిష్కారానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరఫున సాధ్యమైనంత మేర పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఐఎంఏ జిల్లా శాఖ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందిస్తూ, వైద్యుల ఐక్యత, సేవాభావం, సమాజం పట్ల అంకితభావం ప్రజారోగ్య పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వం, ప్రైవేటు వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అధ్యక్షులు సాల్వాది రమేష్ కుమార్ మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యులు సంఘటితంగా ఉండాలని, ఐకమ త్యంతో సమస్యలు పరిష్కరించుకోవాలని, భవిష్యత్తులో వైద్య వృత్తిలోకి వచ్చే వారికి మార్గదర్శకంగా ఉండాల న్నారు. అనంతరం ఐఎంఏ ప్రతినిధులు డీఎంహెచ్ఓను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐఎం ఏ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఊర రామ్మూ ర్తి, జనరల్ సెక్రటరీ వాగ్మేర్ ఆనంద్ రావు, కోశా ధికారి ఉపేందర్ సింగ్, జాతీయ కౌన్సిల్ మెంబర్ విజయ్ మోహన్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు ఘంట దయాకర్ రెడ్డి, ఎంఎస్ రాధాకృష్ణ, చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు విజయ లక్ష్మి, ప్రమీల, చంద్రశేఖర్, సునీల్ కుమార్, సంయుక్త కార్యదర్శులు మీల సందీప్, ప్రేమ్ కుమార్, ఉదయ్ కుమార్, ఎంఎస్ ఎన్ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు స్వాతి, గౌతమి, అనూష, సంధ్య, శ్రీధర్ రెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.




## నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి

**-బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ లింగయ్య యాదవ్**

భానుపురి /సూర్యాపేట టౌన్

ఎన్నికల సమయంలో లక్షలాది మంది నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని బీసీ విద్యార్థి జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ వీరబోయిన లింగయ్య యాదవ్ అన్నారు ఈ సందర్భంగా స్థానిక సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. యువతకు ఉద్యోగాలు ఇస్తామని, భృతి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పడం దారుణం. ఇచ్చిన మాట నిలబెట్టుకొని నిరుద్యోగుల హామీలను వెంటనే నెరవేర్చాలి.2.30 లక్షల ఉద్యోగాలు మొదటి ఏడాదే 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు 10% కూడా భర్తీ కాలేదు. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి అన్ని ఖాళీలు వెంటనే భర్తీ చేయాలి.నిరుద్యోగ భృతి రూ. 3000 ప్రతి నిరుద్యోగికి నెలకు రూ. 3000 భృతి ఇస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చి సంవత్సరాలు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. బకాయిలతో సహా వెంటనే చెల్లించాలి. పేపర్ లీకేజీలు లేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తామని, ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఒక్క క్యాలెండర్ కూడా విడుదల కాలేదు. ప్రైవేట్ కంపెనీల్లో స్థానికులకు 75% ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. ఆ దిశగా ఒక్క చట్టం కూడా చేయలేదు.15 రోజుల్లో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి మెగా ఋజ, గ్రూప్స్ నోటిఫికేషన్లు ఇవ్వాలి. నిరుద్యోగ భృతి రూ. 3000 బకాయిలతో సహా వెంటనే అమలు చేయాలి.అన్ని పోటీ పరీక్షలకు వయోపరిమితి 2 ఏళ్లు సడలించాలి.6ఇచ్చిన హామీలపై శ్వేతపత్రం విడుదల చేయాలి. నిరుద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దు. హామీలు నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది నిరుద్యోగులతో "కొలువుల కొట్లాట" చేపడతా. అని హెచ్చరించారు ఈ సమావేశంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బోనగిరి సతీష్, బీసీ విద్యార్థి సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు రాజబోయిన సుమన్, గణేష్, నాగరాజు, నరేష్, అశోక్, శశి , నందు తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పి ఆర్ టి యు ద్వారానే సాధ్యం

-ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి వెల్లడి

భానుపురి /సూర్యాపేట టౌన్



తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద ఉపాధ్యాయ సంఘంగా కొనసాగుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పిఆర్టియు సంఘం ఎల్లవేళలా కృషి చేస్తుందని శాసనమండలి సభ్యులు పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం జరిగిన జిల్లా కమిటీ అత్యవసర సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు కనీస సౌకర్యాలు లేని సమయంలో 55 సంవత్సరాల క్రితమే ఆవిర్భావించిన పిఆర్టియు సంఘం ద్వారా పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు పెన్షన్, కమ్యూటేషన్, గ్రాట్యుటీ, అర్జిత సెలవులు, పదోన్నతులు లాంటి సౌకర్యాలు లభించాయన్నారు. తాను ఎమ్మెల్సీగా ఎన్నికైన అనంతరం ఉపాధ్యా యులకు పదోన్నతులు ఇప్పించడంతోపాటుగా గురు కులాలకు కామన్ టైం టేబుల్ సాధించామన్నారు. పెండింగ్ బిల్లులను నెలవారిగా 2000 కోట్లకు చెల్లించేందుకు కృషి చేశామన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ జీవో ఇప్పించా మన్నారు. రాబోయే కాలంలో మంచి పిఆర్సి ఇప్పించడంతో పాటుగా పెండింగ్ లో ఉన్న డిఏ ల విడుదలకు కృషి చేస్తున్నామన్నారు . సిపిఎస్ విధానం రద్దుతో పాటుగా, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించేందుకు త్వరలో పోరాట కార్యక్రమం రూపొందిస్తామన్నారు. ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ నిబంధనలను రూపొందించేందుకు స్థానిక సంస్థల ఎన్నికలు ఏర్పాటు జరగగానే ప్రయత్నాలు ప్రారంభిస్తామన్నారు. 317 జీవో కింద నష్టపోయిన ఉపాధ్యాయులకు ఖాళీ స్థానాల్లో సర్దుబాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మోడల్ స్కూల్, గురుకుల, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృత నిశ్చయంతో ఉన్నామన్నారు. జిల్లా అధ్యక్షులు తంగేళ్ల జితేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఇట్టి సమావేశంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తీగల నరేష్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ , ఆడిట్ కమిటీ వైస్ చైర్మన్ చల్ల ప్రభాకర్ రెడ్డి, క్రమశిక్షణ కమిటీ సభ్యులు కందుకూరి శివశంకర్, మాజీ జిల్లా , ప్రధాన కార్యదర్శులు చింతరెడ్డి రామలింగారెడ్డి, జిల్లా నుంచి రాష్ట్ర కమిటీకి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు జిల్లా అసోసియేట్ అద్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, సీనియర్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కోటేశ్వర రావు సేవలు మరువలేనివి



భానుపురి/త్రిపురారం

గత 30 సంవత్సరాలుగా వృత్తి విద్య ఉపాధ్యాయునిగా పని చేయించు నేడు నల్లగొండ జిల్లా త్రిపురారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందుతున్న జి .కోటేశ్వరరావు ని మండల విద్యాధికారి రవి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వృత్తివిద్యా బోధకుడు, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అసోసియేటెడ్ కార్యవర్గ సభ్యులు గోపారపు రాజు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా కోటీశ్వరరావు సేవలను కొనియాడుతూ పనిచేసిన ప్రతిచోట ఉపాధ్యాయులందరికీ ప్రశంసలు అందుకున్నాడని ఎంతోమంది విద్యార్థులని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాడని తెలియజేశారు. వీరు భవిష్యత్తు లో ఆయురారోగ్యాలతో జీవించాలని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, హబీబా, అలీ, భగవంతు రెడ్డి, పందిరి శ్రీనివాసు, శాంతాబాయి తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా మందిరం నూతన కమిటీ కి సన్మానం



భానుపురి /సూర్యాపేట కల్చరల్

ఇటీవల సాయిబాబా మందిరం నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షులుగా కర్నాటి రవి, ఉపాధ్యక్షులుగా మిరియాల సుధాకర్, కోశాధికారిగా పోతుగంటి మల్లికార్జున్ లు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. గురువారం సాయిబాబా మందిరం లో జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు, అవోప జిల్లా ఉపాధ్యక్షులు, నల్గొండ జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంక్ రిటైర్డ్ అసిస్టెంట్ మేనేజర్ తాళ్లపల్లి రామయ్య శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ ఆలయ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

# రమణేశ్వర మహాక్షేత్రాన్ని సందర్శించిన విశ్వ హిందూ పరిషత్ ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ సత్యం

భానుపురి /భువనగిరి



తెలంగాణలో వెలసిన విశిష్ట శైవ క్షేత్రమైన రమణేశ్వర మహాక్షేత్రాన్ని విశ్వ హిందూ పరిషత్ ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ సత్యం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి వారిని దర్శించుకుని ఆశీర్వాదం పొందారు. అనంతరం రమణేశ్వర మహాక్షేత్రంలోని పవిత్రమైన బంగారు శివలింగానికి భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించారు. రమణేశ్వరంలోని ద్విసహస్ర శివలింగాలు, శ్రీచక్రాలు, వివిధ దేవతా ఆలయాలను దర్శించిన సత్యం ఆధ్యాత్మిక ఆనందాన్ని వ్యక్తం చేశారు. రమణేశ్వరంలో హిందూ ధర్మానికి చెందిన అన్ని రకాల దేవతామూర్తులు, దేవతల విగ్రహాలు దర్శనమిస్తున్నాయని, ఇది సనాతన ధర్మ వైభవాన్ని ఒకేచోట ప్రతిబింబించే మహాక్షేత్రమని ఆయన అన్నారు. వేదాగమ సంప్రదాయాలు, శివారాధన, శ్రీచక్రారాధన, భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతి గొప్పతనాన్ని ప్రత్యక్షంగా అనుభవింపజేసే క్షేత్రంగా రమణేశ్వరం నిలుస్తోందని అభిప్రాయపడిన సత్యం ఈ క్షేత్ర నిర్మాణంలో ఇమిడి ఉన్న వేద, ఆగమ శాస్త్ర పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకున్నారు.తెలంగాణ భూమిపై ఇలాంటి గొప్ప శైవ క్షేత్రం వెలసి ఉండటం హిందూ సమాజానికి గర్వకారణమని, ఇది తెలంగాణను దేశంలోనే ఒక మహా శైవ క్షేత్రంగా నిలబెడుతుందని ఆయన పేర్కొన్నారు. సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి వారి దార్శనికత వల్ల సాధ్యమైన ఈ నిర్మాణం, రాబోయే తరాలకు హిందూ ధర్మంపై అవగాహన, గౌరవం పెంపొందించడంలో విశేషంగా దోహదపడుతుందని ఆయన అన్నారు. యువత కేవలం ఆధునిక విద్యలోనే కాకుండా, మన ధర్మం, సంస్కృతి, ఆధ్యాత్మిక సంపద గురించి కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని సత్యం అభిప్రాయపడ్డారు. రమణేశ్వరంలాంటి క్షేత్రాలు యువతకు హిందూ ధర్మం యొక్క లోతు, శాస్త్రీయత, ఆధ్యాత్మికతను పరిచయం చేసే ఆధ్యాత్మిక కేంద్రాలుగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి పవిత్ర క్షేత్రాలను ప్రతి హిందువు దర్శించి, సనాతన ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సత్యం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ స్టేట్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర రాజు స్టేట్ జాయింట్ సెక్రటరీ భాను ప్రసాద్ స్టేట్ టోలి మెంబర్ మురళీ మోహన్ రెడ్డి గ స్టేట్ టోలి మెంబర్ రవి ప్రకాశ్ రెడ్డి స్టేట్ టోలి మెంబర్ చంద్ర మోహన్ భువనగిరి ఇంచార్జ్ శ్రీనివాస్ సహా పలువురు ప్రముఖ విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు

# ఘనంగా ప్రముఖ వైద్యుడు డాక్టర్ విజయమోహన్ జన్మదిన వేడుకలు

-డివైన్ టచ్ హాస్పిటల్‌లో కేక్ కట్ చేసి వేడుకలు..

-స్నేహ నిలయంలో అన్నదాన కార్యక్రమం

-సేవే వైద్యుడి గొప్ప గుర్తింపు.. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డాక్టర్ విజయమోహన్ పిలుపు

భానుపురి /సూర్యాపేట టౌన్

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డివైన్ టచ్ హాస్పిటల్‌లో ప్రముఖ వైద్యుడు డాక్టర్ విజయమోహన్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, స్నేహితులు, అభిమానులు కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్నేహ నిలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి పలువురు నిరుపేదలు, వృద్ధులకు భోజనాలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయమోహన్ మాట్లాడుతూ, పుట్టినరోజు వేడుకలను ఆడంబరాలకు పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి చేయూత అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. వైద్య సేవలతో పాటు మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం ద్వారా జీవితానికి నిజమైన సార్థకత లభిస్తుందని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ప్రముఖులు, స్నేహితులు, అభిమానులు పాల్గొని డాక్టర్ విజయమోహన్ సార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. .



# తెలంగాణ ఉద్యమకారుల ముందస్తు అరెస్టులు




భానుపురి/యాదాద్రి భువనగిరి

తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్) పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ఇచ్చిన పిలుపుమేరకు జులై 2న చలో ఉప్పల్ లోని బాగాయత్ భూ పోరాటంలో భాగంగా తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఉదయం నుండే యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆలేరు పోలీసులు నాయకులను అరెస్టులు చేశారు.చలో ఉప్పల్ కు నిరసన, ధర్నా కార్యక్రమంకు వెళ్లకుండా స్థానిక పోలీస్ లు ముందస్తు అరెస్టు చేశారు. అలాగే కొంతమంది నాయకులను ఘట్కేసర్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు. ఈ అక్రమ అరెస్టులను మలిదశ తెలంగాణ ఉద్యమకారులకు తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 250 గజాల ఇంటి స్థలము, పెన్షన్, హెల్త్ కార్డు వెంటనే అమలు చేయాలని ఈ సందర్భంగా ఉద్యమకారులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో ఉద్యమకారుల హక్కుల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలను నిర్వహిస్తామని తెలిపారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో పసుపునూరు వీరేశం, రాచకొండ జనార్ధన్, చెక్క వెంకటేష్, తమ్ముడి పద్మారావు, బడుగు జహంగీర్ ఉండగా ఘట్కేసర్ వద్ద అరెస్టు చేసిన వారిలో ఆలేరు మాజీ ఎంపీపీ అనసూయ, పూస శ్రీనివాస్, జంపాల శ్రీనివాస్, సీసా మహేశ్వరి, ఇందిరాతో పాటు మరికొందరు ఉద్యమకారులు ఉన్నారు.